క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకంతో లాభాలు

చీరాల టౌన్: వర్షాకాలంలో రైతులు పండ్ల తోటలను పెంపకాలను చేసుకోవడం వలన వృద్ధి చెందుతారని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం దాసు శనివారం తెలిపారు. పండ్ల తోటల పెంపకాలకు కావాల్సిన సమాచారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డు అసిస్టెంట్ల వద్ద ఉందని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి, సపోట, జామ, సీతాఫలం, జీడిమామిడి పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. పండ్ల తోటల పెంపకాలు చేయాలనుకునే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, బ్యాంకు ఖాతా నకళ్లతో ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

పెంపుడు కోళ్లు చోరీ

బల్లికురవ: నివాసగృహం పక్కన షెడ్డులో ఉంచిన 3 జాతి కోడిపుంజులు శనివారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు పడమర భాగంలో పావులూరి సుబ్బారావు నివాసం ఉంటున్నాడు. బాధితుడు కోళ్లతోపాటు ఆవు దూడలను కూడా పెంచుతున్నాడు. ఉదయం నిద్రలేవగానే కోడి పుంజులు లేకపోటంతో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 3 రోజుల క్రితమే రూ.60 వేలకు అడిగారని బాధితుడు సుబ్బారావు వివరించారు. సీసీ పుటేజీని పరిశీలించి బైక్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీయుజ మాసం శతభిషం త్రయోదశి ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పాలకమండలి బాధ్యతల స్వీకరణ



శింగరకొండ దేవస్థాన నూతన పాలకమండలి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన నూతన పాలకమండలి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాలకమండలి అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకరరావు అధ్యక్షత సభ్యులతో సమావేశం నిర్వహించారు. దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అద్దంకిలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలి

అద్దంకి రూరల్: అద్దంకి బస్టాండ్ సమీపంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయని కోరుతూ ఫ్రెండ్స్ ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ వి. వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. డ్రైవర్ల సేవలో కార్యక్రమం అమల్లో భాగంగా అద్దంకి విచ్చేసిన కలెక్టర్‌కు వారి సమస్యలు చెప్పుకున్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లందరికీ ఓనర్లతో సంబంధంలేకుండా పథకాన్ని వర్తింప చేయాలని కోరారు. సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రైవేట్ పాగా



చీరాల ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు పార్కింగ్ ప్రదేశంగా..



మున్సిపల్ కార్యాలయం రోడ్డులో బారులు తీరన ట్రావెల్ బస్సులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- వాహనాలకు అడ్డాగా చీరాల ప్రధాన రహదారులు
- ట్రావెల్ బస్సుల పాయింట్లుగా మారిన వైనం
- రోడ్లు పైనే వాహనాల మరమ్మతులు

చీరాల టౌన్: బాపట్ల జిల్లాలోని ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న చీరాల్లో వేలాది వాహనాలు అలజడి సృష్టిస్తున్నాయి. పలు ప్రధాన రహదారులు, ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారాయి. రహదారులపైనే వాహనాలను నిలిపి వాటికి మరమ్మతులు చేస్తుండడంతో ట్రాఫిక్ జాం అవుతోంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తూ రహదారుల్లో జాగా లేకుండా చేస్తున్నారు.గల్ఫర్ మిషన్లు, ప్రయివేటు ఆంబులెన్సులు, ఇతర వాహనాలు, ఆటోలు, కారులు నిలుపుదల చేస్తున్నా పోలీసులకు ఏమాత్రం పట్టడంలేదు.

రోడ్లు విస్తరించినా..

వాహనాల రాకపోకలకు వీలుగా ఉండేందుకు మున్సిపల్ ఆఫీసు రోడ్డు, చర్చి రోడ్డు, విఠల్ నగర్ రోడ్డులో సిమెంటు రోడ్డు వేసి విస్తరించారు. చీరాలకు ముఖ్యమైన మున్సిపల్ కార్యాలయం రోడ్డులో ప్రతిరోజూ ప్రయివేటు ట్రావెల్ బస్సులు నిలుపుదలతో ట్రాఫిక్‌కు, ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రావెల్ బస్సుల స్టాప్‌లుగా మారింది. చీరాల నుంచి నిత్యం హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, బెంగళూరు వంటి నగరాలకు సుమారు 15 వరకు ట్రావెల్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పోలీసు, మున్సిపల్, తదితర శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రాత్రి సమయాల్లో కూడా వాహనాలు రోడ్లపైనే నిలిపి ఉంచడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చర్చి రోడ్డులో రోడ్డు పక్కన మినీ బస్సులు, ట్రాక్టర్లు వంటివి నిలుపుతున్నారు. అలానే రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న విఠల్ నగర్ రోడ్డు ప్రవేటు వాహనాలకు అడ్డాగా మారింది. ఓవర్‌బ్రిడ్జి కింద గ్యారేజీలు ఏర్పాటు చేసుకుని ప్రయివేటు వాహనాలకు మరమ్మతులు చేసుకుంటూ రోడ్డును సగభాగం ఆక్రమించారు. గ్యారేజీ పనుల కోసం ఈ రోడ్డుపై వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు ప్రవేటు వాహనాల పార్కింగ్ రోడ్డుగా మారింది. ఇక్కడ ప్రయివేటు వాహనాలు పార్కింగ్ చేసినా అడిగే నాథుడే లేడు. కొత్తపేటకు వెళ్లే ప్రధాన రహదారి ఇలా ఉంటే మిగిలిన రోడ్లు పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలానే విఠల్‌నగర్, వైకుంఠపురం, హరిప్రసాద్‌నగర్, స్వర్ణ వైపు వెళ్ళే ఆటోలు, పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రజలు ఆర్వోబీ సర్వీసు రోడ్డులో వాహనాల నిలుపుదల చేస్తుండటంతో ద్విచక్ర వాహనాల రాకపోకలు కష్టంగా మారాయి.

రోడ్లపై వాహనాల మరమ్మతులు చేయకుండా చర్యలు తీసుకోండి

రద్దీగా ఉండే రోడ్ల పక్కన వాహనాలు నిలుపుదల చేయడం, మరోవైపు ఆ వాహనాకు మరమ్మతులు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, కొత్తపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలపుదల చేస్తున్నారు.

– కె.వెంకటేష్

ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి

చీరాల మున్సిపల్ కార్యాలయం రోడ్డు నుంచి సాయంత్రం రాకపోకలు సాగించాలంటే అల్లాడుతున్నాం. ప్రయివేటు ట్రావెల్ బస్సులు పదుల సంఖ్యలో నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– ఎం. ఏడుకొండలు

వరాల తల్లీ.. మళ్లీ రావమ్మా..!



ఈపురుపాలెం రజకవీధిలో దుర్గమ్మను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



ఊరేగింపుగా వెళుతున్న అమ్మవారు

చీరాల టౌన్: దసరా దేవీ నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలోని కొలువుదీరిన దుర్గా మాతకు పది రోజుల పాటు విశేష పూజల అనంతరం శనివారం గంగ ఒడికి తరలిస్తున్నారు. మేళ తాళాలు, డీజే పాటల హోరు.. యువకుల నృత్యాలు.. మహిళల పూజలతో జగజ్జననికి జనం వీడ్కోలు పలుకుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో గ్రామాల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించిన అనంతరం వాడరేవుకు తరలించి గంగమ్మ ఒడిలోకి సాగనంపారు. లోక మాత జగజ్జనని మళ్లీ వచ్చే ఏడాది కలుద్దామంటూ భక్తులు దుర్గమ్మకు వీడ్కోలు పలికారు. కనకదుర్గా మాతల నిమజ్జనాల సందర్భంగా వాడరేవులో సందడి నెలకొంది.

వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించిన బ్రహ్మానందరెడ్డి



వెంకటేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న బ్రహ్మానందరెడ్డి తదితరులు

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుక్కల వెంకటేశ్వరరెడ్డిని ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల వెంకటేశ్వరరెడ్డి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఒంగోలులోని ప్రవేట్ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నాడు. అతన్ని.. బ్రహ్మానందరెడ్డి స్వయంగా ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొల్లాటి ఏడుకొండలు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కరణం పరామర్శ



పాల్‌రాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి

చీరాల రూరల్: వైఎస్సార్ సీపీ నేత, పేరాల్లోని ఆనందపేటకు చెందిన పేర్లి నాని తండ్రి పాల్‌రాజు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. చీరాల్లోని గోరంట్ల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి శనివారం పరామర్శించారు. నానితో పాటు కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్యంపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



పోషకాహార మహోత్సవంలో మాట్లాడుతున్న సీడీపీవో కల్యాణివర్మ

కొత్తపట్నం: గర్భిణులు, బాలింతలు పోషకాహారమైన చిరుధాన్యాలు తీసుకోవడం వలన వారికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో కల్యాణివర్మ తెలిపారు. ఈతముక్కల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కోడ్ నంబర్ 8లో శనివారం పోషకాహార మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.పిచ్చమ్మ అధ్యక్షత వహించగా, సీడీపీవో మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు ప్రతి పిల్లవానికి పోషకాలు అందించే ఆహారం ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతి రోజూ రావాలని కోరారు. ఏసీడీపీవో వై.అంజమ్మ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే ప్రతి పిల్లవాని బరువు, ఎత్తు క్రమం తప్పకుండా తీసి మన రికార్డులో నమోదు చేయాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్‌లో అందించే సరుకులను ప్రతి బాలింత, గర్భిణీ క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఏఎన్‌ఎం జి.సుజాత, ఏఈవో నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



నక్కబొక్కలపాడు చెరువుకు చేరిన నీరు



ఈర్ల చెరువు కింద నారుమళ్ల పెంపకం

బల్లికురవ: ఇటీవల కాలంలో అల్పపీడనం తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు సాగర్ కాలువల నుంచి వృథా నీరు చేరటంతో సాగునీటి చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఆగస్టు మాసాంతం వరకు ఒట్టి పోయిన చెరువులు ఇటీవల వర్షాలకు నిండుకుండలా ఉన్నాయి. నక్కబొక్కలపాడు ఈర్ల చెరువు, ముక్తేశ్వరం దండెబంధం చెరువు, వైదన, కొప్పరపాడు, గొర్రెపాడు గుంటుపల్లి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరింది.



నిండుకుండలా కొప్పరపాడు చెరువు

సాగుకు సమాయత్తం..

చెరువులకు నీరు చేరటంతో రైతులు ఆహారధాన్యమైన వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. నక్కబొక్కల పాడు ఈర్ల చెరువు కింద నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, కొణిదెన, మల్లాయపాలెం గ్రామాలకు చెందిన సుమారు 800 ఎకరాలకు ఆయకట్టు ఉంది. ఈ భూముల్లో వరిసాగుకు 10 రోజులుగా నారుమళ్ల పెంపకాన్ని చేపట్టారు. అక్టోబర్ మాసాంతానికి నారు యాతకు రావటంతో వరి సాగుచేసే అవకాశాలున్నాయి. గొర్రెపాడు, కొప్పరపాడు, వైదన, ముక్తేశ్వరం, గుంటుపల్లి చెరువులకు నీరు చేరటంతో వ్యవసాయ పనులు గ్రామాల్లో ఊపందుకున్నాయి.

వైభవంగా కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారు

అద్దంకి రూరల్: దసరా శరన్నవరాత్రుల్లో పూజలందుకున్న అద్దంకిలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి శనివారం రాత్రి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళాభక్తులు వార్లు పోశారు. కేరళ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారిని ప్రత్యేక అలంకరించారు.



ఆకట్టుకున్న కేరళ నృత్యాల, కోలాటం

అద్దంకి తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



బూదవాడ గ్రామం నుంచి అద్దంకి బయలు దేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

జె.పంగులూరు: అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్తగా శనివారం డాక్టర్ చింతలపూడి అశోక్ కుమర్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని 21 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యంలో కార్యక్రమానికి హాజరయ్యారని మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు తెలిపారు. వేల సంఖ్యలో హాజరైయినట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



వీవోఏలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

జె.పంగులూరు: జీఎస్టీ తగ్గింపుతో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో లాభ సాటి అని ఎంపీడీఓ కె. స్వరూపారాణి అన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం కోటేశ్వరరావు అధ్యక్షతన జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ స్వరూపారాణి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు కలిగిందన్నారు. వైద్య సేవలకు సంప్రదించి పన్ను పూర్తిగా తగ్గించడం వలన పేద ప్రజలకు వైద్య భారం కొంత తగ్గిందన్నారు. రైతులకు వ్యవసాయ పనిముట్లపై పన్ను తగ్గించామని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలపై కూడా జీఎస్టీ తగ్గింపు ధరలు బాగా తగ్గాయన్నారు. ఈ విషయమై వీవోఏలు గ్రామ స్థాయి డ్వాక్రా మహిళలకు తెలియజేయలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, మండల సమాఖ్య కార్యదర్శి కమలాకుమారి, సీసీలు సాల్మన్, చంద్ర, వీఓఏలు హాజరయ్యారు.

సుభాని కుటుంబానికి ఆర్థిక సాయం



సుభాని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

యద్దనపూడి: అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శనివారం ఆర్థికసాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మండల కేంద్రమైన యద్దనపూడిలో బబ్బేపల్లి సుభానికి గత కొంత కాలంగా షుగర్‌వ్యాధి కారణంగా తన రెండు కళ్లతో పాటు రెండు కాళ్లు కూడా కోల్పోయి మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ భారాన్ని వృద్ధురాలైన సుభాని భార్య తన భుజాన వేసుకొని మోస్తోంది. ఈ విషయం మార్టూరు హెల్పింగ్ హ్యాండ్ సంస్థ దృష్టికి రావటంతో సంస్థ సభ్యులు స్పందించి రూ.7 వేలు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌వలి, కేబుల్ బాషా, పుట్టా అయ్యప్ప స్వామి, కె. హరిబాబు షేక్ హాబీబా, పాలు, బెంజిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ విజయలక్ష్మి

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ప్రత్యేకాధికారి డ్వామా పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం ప్రారంభించిన ఆటోడ్రైవర్‌ల సేవలో కార్యక్రమాన్ని మండల కేంద్రమైన పర్చూరు పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ముందుగా పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఆటో డ్రైవర్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఆరు మండలాల్లోని 926 మంది ఆటోడ్రైవర్లు లబ్ధిదారులుగా ఉన్నారని.. ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. ఆటో డ్రైవర్‌లు ఎక్కువ మందికి సొంత ఆటోలు లేవని బాడుగకు తీసుకొని ఆటోలు నడుపుతున్నారని వారికి ప్రభుత్వం రాయితీపై ఆటోలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవి నాయక్, ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి, డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, కార్యదర్శి మస్తాన్‌రావు, పంచాయతీ సిబ్బంది, ఆటో డ్రైవర్‌లు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చీరాల రూరల్: చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తక్షణమే అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర మహాసభలు సత్తెనపల్లిలో జరుగుతున్న నేపథ్యంలో శనివారం వేటపాలెం చేనేతపురి, ఈపురుపాలెం, చీరాల పరిసర ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేతపని చేస్తున్న ప్రతి కార్మికునికి ఎన్నికల హామీలో భాగంగా ఏడాదికి రూ. 25 వేలు ఆర్థికసాయం, చేనేతపై జీఎస్టీ ఎత్తివేత, చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పి. కొండయ్య, హేమ సుందర బాబు, ఎ. రాధాకృష్ణ, బి. శ్రీరాములు, ఎ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.